డిఆర్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన అనిత

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా రెవెన్యూ అధికారిగా ఎస్.డి.అనిత శనివారం కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఎం.గణపతిరావు స్థానంలో జిల్లా రెవెన్యూ అధికారిగా ఆమె నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆమె విశాఖలో ఎపిఐఐసిలో జోనల్ మేనేజర్‌గా చేశారు. గతంలో ఆమె జిల్లాలో పర్యాటక శాఖ అధికారిగా చేశారు. ప్రస్తుత డిఆర్‌ఓ ఎం.గణపతిరావు శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ అధికారిగా నియమితులయ్యారు. డిఆర్‌ఓగా నియమితులైన అనితకు కలెక్టరేట్ ఎఒ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

డిఆర్‌ఒ అనిత

చీపురుపల్లి, విజయనగరంలో కాగడాలతో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

నిర్బంధాలు.. నిరసనలు

- చంద్రబాబు అరెస్టుపై భగ్గుమన్న టిడిపి శ్రేణులు
- గృహనిర్బంధాలు, అరెస్టులకు పాల్పడిన పోలీసులు

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అరెస్టుపై ఆ పార్టీ శ్రేణులు భగ్గుమన్నాయి. జిల్లా వ్యాప్తంగా శనివారం ఆందోళనలు, రాస్తారోకోలు చేపట్టాయి. ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో, గ్రామ స్థాయిలో నిరసనలు చేపట్టాయి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాయి. రోడ్డుపైకి వచ్చిన టిడిపి నాయకులు, కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముందస్తుగా టిడిపి ముఖ్య నాయకులు, మాజీ ఎమ్మెల్యేలపై పోలీసులు గృహ నిర్బంధం ప్రయోగించారు.

పోలీసుల అదుపులో ఉన్న టిడిపి జిల్లా ప్రధానకార్యదర్శి ఐవిపి రాజు, నాయకులు

అశోక్ బంగ్లా వద్ద మోహరించిన పోలీసులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

టిడిపి అధినేత చంద్రబాబును సిఐడి అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న ఆ పార్టీ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. పోలీసులు వారిని అడ్డుకుని ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. విజయనగరంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు బంగ్లాకు ఉదయం 5.30 గంటలకు పోలీసులు చేరుకుని, గేట్లు మూసేశారు. అశోక్‌ను బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారు. తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు నగరంలో గురజాడ, అంబేద్కర్, గాంధీ, ఎన్‌టిఆర్ విగ్రహాల వద్ద నిరసనలు చేపట్టారు. ప్రదీప్‌నగర్ కూడల్లో నిరసన తెలిపారు. ద్వారపూడిలో స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పూజలు నిర్వహించారు. ఆందోళన చేసిన టిడిపి నాయకులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కర్రోతు నర్సింగరావు, పి.మహేష్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు తదితరులను టూ టౌన్, గంట్యాడ పోలీసుస్టేషన్లకు తరలించారు.

గురజాడ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి శ్రేణులు

రాజ్యాంగానికి విరుద్ధం

రాజ్యాంగానికి విరుద్ధంగా, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అరెస్టు చేశారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌గజపతి రాజు ధ్వజమెత్తారు. శనివారం రాత్రి అశోక్ బంగ్లా వద్ద కాగడాలతో నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో సమాధానం కూడా చెప్పకపోవడం జగన్ రెడ్డి మార్కు పాలనకు నిదర్శనమన్నారు. ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేసే తీరు ఇదా జగన్ రెడ్డి? అని ప్రశ్నించారు. నాలుగున్నరేళ్లలో వైసిపి సాధించింది ఏమైనా ఉందా? అంటే ఒక దొంగ ప్రతి వారం సంతకాలు పెట్టేది లేకుండా చేశారంతేనని వ్యాఖ్యానించారు. నిర్బంధాలు అరెస్టులతో ఏమీ సాధించలేరన్నారు. తెల్లదొరల దగ్గరే భయపడలేదని, వీరి వద్ద ఎందుకు భయపడాలని మండిపడ్డారు. వైసిపి సర్కారును ఎంత త్వరగా ఇంటికి పంపిస్తే రాష్ట్రానికి అంత మంచిదన్నారు.

రాజకీయ దురుద్దేశంతోనే

లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు బాబ్జీ

విజయనగరంకోట : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును రాజకీయ దురుద్దేశంతోనే అరెస్టు చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి.బాబ్జీ తెలిపారు. శనివారం విజయనగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం సిఐడిని అడ్డుపెట్టుకుని అరెస్టు చేసిన తీరు ముమ్మాటికీ రాజ్యాంగ ఉల్లంఘనేనని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో పోలీసులు అతిగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. రాష్ట్రాన్ని మరో బీహార్‌లా తయారు చేస్తున్నారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు ఉండకూడదని సిఎం జగన్ భావిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో ఇది జరగని పనని తెలుసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు.

అరెస్ట్ తీరు అప్రజాస్వామికం

జనసేన నేత గురాన అయ్యలు

విజయనగరం టౌన్ : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్ట్ తీరు అప్రజాస్వామికమని జనసేన నేత గురాన అయ్యలు ఖండించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు అరెస్టు పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యగానే భావిస్తున్నామని పేర్కొన్నారు. విశాఖలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పట్ల కూడా అలాగే ప్రవర్తించారని, ఏ తప్పూ చెయ్యని జనసేన కార్యకర్తలను అరెస్టు చేశారని చెప్పారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడానికే సిఎం జగన్ ఇలా చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపులకు, అక్రమ అరెస్టులకు భయపడేది లేదని స్పష్టంచేశారు.

ప్రజల సొమ్ము కాజేసినందుకే..

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం టౌన్ : ప్రజల సొమ్ము కాజేసిన కేసులోనే చంద్రబాబును సిఐడి అరెస్ట్ చేసినట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అరెస్టులో అసలు విషయం పక్కదోవ పట్టించేలా టిడిపి నేతలు గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. స్కీమ్ పేరుతో స్కామ్ చేశారని ఆరోపించారు. ఇది రాత్రికి రాత్రి జరిగింది కాదని, దాదాపు రెండేళ్ల కిందటే ఎఫ్ఐఆర్‌లో చంద్రబాబు పేరు నమోదు అయ్యిందని చెప్పారు. 2017-18లోనే జిఎస్‌టి డిజి నేతృత్వంలోని బృందం రూ.241 కోట్లు దారిమళ్లినట్టు బయటపెట్టిందని, ఎఫ్ఐఆర్ కంటే ముందే జిఎస్‌టి నిఘాలో స్కామ్ బయటపడిందని తెలిపారు. ఎటువంటి కంపెనీలు లేకుండా రూ.371 కోట్లు అవినీతికి పాల్పడ్డారని చెప్పారు. ఆరోపణలున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించడం సాధారణమని, రెండేళ్లుగా సాగుతున్న దర్యాప్తు కేసులో ఇప్పుడు కూడా చంద్రబాబును ప్రశ్నించకపోతే ఎలా? అని ప్రశ్నించారు. ఎల్లప్పుడూ 'నిప్పు.. పప్పు' అని చెప్పుకుంటున్న చంద్రబాబు నిజాయతీని నిరూపించుకోవాలని హితవుపలికారు. సమావేశంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొన్నారు.

తప్పు చేస్తే శిక్ష తప్పదు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం టౌన్ : ఎంతటివారైనా తప్పు చేస్తే శిక్ష తప్పదని, ఎటువంటి తప్పూ చేయకుంటే చంద్రబాబు తన నిజాయతీని నిరూపించుకోవాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శనివారం ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కిల్ డెవలప్మెంట్ పేరుతో ఎటువంటి కంపెనీ లేకుండా రూ.377 కోట్ల అవినీతి జరిగిందని సిఐడి నిరూపించిందన్నారు. అందుకే చంద్రబాబును అరెస్టు చేశారని, అంతేతప్ప రాజకీయ కక్ష సాధింపు కాదని తెగేసిచెప్పారు. దీనికి ఎటువంటి రాజకీయాలు ఆపాదించవద్దని మిగిలిన రాజకీయ పార్టీలకు సూచించారు. ఇంతవరకు చంద్రబాబు మాయమాటలతో చేసిన తప్పులను కప్పి పుచ్చుకునే ప్రయత్నం చేశారన్నారు. ఇందులో సూత్రదారులుగా ఉన్న అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు, ఆయన కుమారుడును కూడా అరెస్ట్ చేసినట్లు చెప్పారు. చంద్రబాబు ప్రస్తుతం అనేక కేసుల్లో స్టే మీద ఉన్నారని అవన్నీ ఎత్తేస్తే మళ్లీ అరెస్టులు తప్పవన్నారు.

వైద్య కళాశాలను పరిశీలిస్తున్న మంత్రులు బొత్స సత్యనారాయణ, విడదల రజని

15న వైద్య కళాశాల ప్రారంభం

- నెరవేరనున్న చిరకాల స్వప్నం : మంత్రి బొత్స
- రూ.8,500 కోట్లతో 17 వైద్య కళాశాలలు : మంత్రి రజని
- ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా ప్రజల చిరకాల స్వప్నాన్ని నిజం చేస్తూ ఈ నెల 15న విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలను సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, వైద్యారోగ్య శాఖా మంత్రి విడుదల రజని తెలిపారు. దీంతోపాటు రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల, ఏలూరు వైద్య కళాశాలలను కూడా ముఖ్యమంత్రి ఇక్కడి నుంచే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వి.టి.కృష్ణబాబు, ఎపిఎంఎస్ ఐడిసి ఎండి మురళీధరరెడ్డితో కలిసి మంత్రులిద్దరూ శనివారం ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇతర అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి పాల్గొనే వేదికలపై చర్చించి, పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలతో పాటు మరో నాలుగు వైద్య కళాశాలలను కూడా ఇక్కడి నుంచే సిఎం ప్రారంభిస్తారని తెలిపారు. ఒక్కో వైద్య కళాశాలను సుమారు రూ.500 కోట్లతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను సుమారు రూ.8500 కోట్లతో నిర్మించడానికి సంకల్పించారని చెప్పారు. దీనిలో భాగంగా తొలి విడత నిర్మాణం పూర్తయిన ఐదు వైద్య కళాశాలలను ఈ నెల 15న సిఎం ప్రారంభిస్తారని చెప్పారు. వచ్చే ఏడాది మరో ఐదు వైద్య కళాశాలలు, ఆ మరుసటి ఏడాది మిగిలిన ఏడు వైద్య కళాశాలలను నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించామని మంత్రి తెలిపారు.

వైద్య కళాశాలకు గొప్ప పేరు తేవాలి

విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలకు గొప్ప పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని విద్యార్థులను మంత్రులు బొత్స సత్యనారాయణ, విడదల రజని కోరారు. ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించిన సందర్భంగా కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడారు. ఒకేసారి ఐదు వైద్య కళాశాలలను ప్రారంభిస్తూ, ఏకంగా 750 సీట్లను అదనంగా అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు.

పకడ్బందీగా సిఎం పర్యటన ఏర్పాట్లు

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బంది రాకుండా, పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎస్‌పి దీపికతో కలిసి హెలిపాడ్ ప్రాంతాన్ని కలెక్టర్ సందర్శించారు. రెండు మూడు చోట్ల పరిశీలించి, అనంతరం జెఎన్‌టియు జంక్షన్ వద్దనున్న స్థలాన్ని ఖరారు చేశారు. పర్యటనలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పాల్గొన్నారు.

నేడు వైష్ణవ్ ఐ కేర్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైష్ణవ్ ఐ కేర్ సెంటరును ఆదివారం ప్రారంభిస్తున్నట్లు వెంకట రామ హాస్పిటల్ అధినేత డాక్టర్ చిట్టి రమణారావు తెలిపారు. వెంకటరామ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో ఐ కేర్ యూనిట్‌ను అత్యాధునిక సదుపాయాలతో ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డాక్టర్ చిట్టి రమణారావు

ఉత్సాహంగా మారథాన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా యువతకు అవగాహన కల్పించేందుకు శనివారం విజయనగరంలో నిర్వహించిన జిల్లా స్థాయి మారథాన్ ఉత్సాహంగా సాగింది. విజ్జీ స్టేడియం వద్ద జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, క్షయ నివారణాధికారి డాక్టర్ సూర్యనారాయణ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా జిల్లా పర్యవేక్షకులు ఎన్.సాక్షి గోపాలరావు.. మారథాన్ ప్రాముఖ్యత వివరించారు. ఈ రెడ్‌రన్ మారథాన్ పోటీలలో పి.సాయి, ఎస్.అశోక్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరికి రూ.10 వేలు, రూ.7 వేలు చొప్పున నగదు బహుమతులు అందించారు. మరో ఏడుగురు విద్యార్థులు కూడా రూ.వెయ్యి చొప్పున బహుమతి గెలుచుకున్నారు. గెలుపొందిన పది మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ జి.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మారథాన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ సూర్యనారాయణ

అథ్లెటిక్స్‌కు ఎంపిక పూర్తి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక విజ్జీ స్టేడియంలో శనివారం జరిగిన జిల్లా అథ్లెటిక్స్ జట్టు ఎంపికలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన వచ్చింది. అథ్లెటిక్స్ ఎంపికలను జిల్లా అథ్లెటిక్స్ సంఘ సభ్యులు అందరూ కలిపి జెండా ఊపి ప్రారంభించారు. సుమారు 500 మంది అథ్లెట్స్ పాల్గొన్నారు. పరుగు, లాంగ్ జంప్, హైజంప్, డిస్కస్‌త్రో, షాట్‌పుట్ వంటి అంశాల్లో ఎంపికలు నిర్వహించారు. ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 21 నుండి ఏలూరు ఎఎస్ఆర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అఫీషియల్స్‌గా వ్యాయామ ఉపాధ్యాయులు గౌరీ శంకర్, తవిటినాయుడు, ఆనంద్ కిశోర్, గణేష్, బాబ్జీ, రామకృష్ణ, గురు నాయుడు వ్యవహరించారు. సీనియర్ క్రీడాకారులు శ్రీనివాస్, కోచ్‌లు శ్రీకాంత్, మధు, నర్సింగ్, శివ, లక్ష్మణ, శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిలిచిన బస్సులు

ప్రయాణికులకు ఇక్కట్లు

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో జిల్లాలో ఆర్‌టిసి బస్సులు విజయనగరం డిపోకే పరిమితమయ్యాయి. ప్రభుత్వం ముందస్తు సమాచారం ఇవ్వకుండా శనివారం బస్సులు నిలిపివేస్తున్నట్లు తెలపడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం తెల్లవారుజామున యథావిధిగా ఉద్యోగులు విధులకు రావడంతో ఉదయం నాలుగు గంటలకు వైజాగ్ వెళ్లే బస్సు ఒకటి బయల్దేరింది. అరగంట తర్వాత ఆర్‌టిసి అధికారులకు సమాచారం రావడంతో అక్కడి నుంచి బస్సులు నిలిపేశారు. దీంతో ఆర్‌టిసి కాంప్లెక్సుకు వచ్చిన ప్రయాణికులు ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇదే అదునుగా ప్రయివేటు వాహనదారులు కొందరు రెట్టింపు ఛార్జీలు వసూలు చేశారు. ఉదయం 10.30 గంటల తరువాత డిపో నుంచి బస్సులు బయటకొచ్చాయి. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

కాంప్లెక్సులో బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు



ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

11న కలెక్టరేట్ వద్ద ధర్నా

ఆటో డ్రైవర్లపై వేధింపులు ఆపాలని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆటో డ్రైవర్లపై పోలీసుల వేధింపులు ఆపాలని, అక్రమ కేసులు రద్దు చేయాలని ఈ నెల 11న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ తెలిపారు. శనివారం ఎల్‌బిజి భవనంలో ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఆటో స్టాండ్లకు వెళ్లి 336 సెక్షన్ కింద ఆటో డ్రైవర్లపై బలవంతంగా అక్రమ కేసులు పెడుతున్నారని, అంగీకరించక పోతే బెదిరిస్తున్నారని తెలిపారు. వేలల్లో జరిమానాలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ చర్యలను కనకదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ ఖండిస్తోందన్నారు. ఆటో డ్రైవర్లపై పెట్టిన అక్రమ కేసులు బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లతో పోలీసులు స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, పార్కింగ్ స్థలాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజులు, పెనాల్టీలు పెంచుతూ విడుదల చేసిన జిఒ 21ను రద్దు చేయాలని, మోటారు వాహన చట్టం-2020ని రాష్ట్రంలో అమలు చేయొద్దని డిమాండ్ చేశారు.

పెట్రోల్, డీజిల్ ధర తగ్గించాలన్నారు. వీటన్నింటిపై కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను ఆటో డ్రైవర్లు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.సూర్యనారాయణ, టి.వి.రమణ, జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, నగర అధ్యక్ష, కార్యదర్శి ఎ.జగన్మోహన్, బి.రమణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నగర సుందరీకరణ... అందమైన అబద్ధం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం సుందరీకరణ ఓ అందమైన అబద్ధం... ఈ మాటలు అంటున్నది ప్రాస కోసం పాకులాడే కవులు, రచయితలు అని నిందలు వేసేసి తప్పించుకుందామనుకుంటే పొరపాటే. నగరంలో మెజార్టీ ప్రజానీకం చెప్పుకుంటున్న వాస్తవ పరిస్థితి. ఇందులో అధికార పక్షం, ప్రతిపక్షం అన్న తేడా కూడా లేదు. ఈ మాటకొస్తే చివరికి వైసిపి కార్యకర్తలు కూడా ఇవే వ్యాఖ్యలను బలపరుస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. నగరంలో అభివృద్ధి - సుందరీకరణ పేరుతో ప్రస్తుత పాలకవర్గం రూ.కోట్లు ఖర్చుచేస్తోంది. కానీ, ఇటు సుందరీకరణా కనిపించడం లేదు. అటు అభివృద్ధి పనుల జాడ కూడా లేదు. దీంతో డబ్బంతా ఎటు వెళ్లిపోతోందో అంటూ జనం సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పైడితల్లమ్మ పండగ ముందు ఉమ్మితడి పనులు చేసేసి రూ.కోట్ల బిల్లులు చేసుకోవడం పాలకవర్గాలకు ఆనవాయితీగా మారిందని, ప్రస్తుత పాలకవర్గంలో అది మరింత ఎక్కువైందని జనం చర్చించుకుంటున్నారు. సుమారు నెల రోజుల క్రితమే మయూరి జంక్షన్ నుంచి బాలాజీ జంక్షన్ వరకు రహదారి మధ్యలో ఉన్న డివైడర్లను తొలగించారు. వాస్తవానికి వీటి ఏర్పాటుకు రెండేళ్ల క్రితమే సుమారు రూ.40 లక్షలు ఖర్చుచేశారు. కానీ, తొలగించారు. దీంతో ఆసుపత్రులు, స్కూళ్లకు వెళ్లే వాహనదారులు ఆయా గోతుల్లో పడిపోతున్నారు. ట్రాఫిక్ కూడా అస్తవ్యస్తంగా మారింది. ఇది కేవలం నగరవాసుల సమస్య మాత్రమే కాదు సుమా! జిల్లా కేంద్రానికి గుండెకాయ వంటి రహదారి ఇది. మన జిల్లాతోపాటు అటు పార్వతీపురం మన్యం, ఇటు విశాఖ, అటు శ్రీకాకుళం నుంచి నగరానికి వచ్చేవారందరికీ ఈ రహదారి అత్యంత కీలకమైనదే. ఈ నేపథ్యంలో ప్రధాన రహదారిలో డివైడర్ హోల్డరింగ్‌ను ఎందుకు తొలగిస్తున్నారో? ఎప్పటిలోగా పునరుద్ధరిస్తారో కనీసం ఒక బోర్డు కూడా పెట్టలేదు.

దీనికితోడు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతుండడంతో జనం రగిలిపోతున్నారు. ట్రాఫిక్ భద్రత, సుందరీకరణ పేరిట డబ్బులు నొక్కేయడానికి తప్ప ఈ పనుల్లో జవాబుదారీతనం ఉన్నట్టుగా లేదని జనం బాహాటంగానే చర్చించుకుంటున్నారు. అటు అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్లట్యాంకు వరకు చేపట్టిన రహదారి విస్తరణ పనులు నేటికీ పూర్తికాలేదు. ఇప్పటికీ గతుకులమయంగా ఉండడంతో జనం తీవ్ర అసహనం, అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బి జంక్షన్ నుంచి అయ్యన్నపేట, పెద్దాసుపత్రి నుంచి గోకపేట మీదుగా బిసి కాలనీలకు తలపెట్టిన రోడ్ల విస్తరణ ప్రారంభానికి నోచుకోలేదు. విస్తరణ సంగతి కాసేపు అటుంచితే, నగరంలో పలు కాలనీల్లో వీధిరోడ్లు, లింకురోడ్ల అస్తవ్యస్తంగా మారాయి. ఉడాకాలనీలో పూర్వం వేసిన రోడ్లు ప్రస్తుతం రాళ్లు తేలిపోతున్నాయి. అటు ఒకటో డివిజన్ అయ్యప్పనగర్‌లో మోడల్ స్కూల్, కస్తూరిబా పాఠశాలలకు వెళ్లే రహదారి చాలా అధ్వానంగా ఉంది. వర్షాకాలంలో రోడ్లపై గతుకుల్లో నీరు చేరుతోంది. కేవలం ఇవి మచ్చుకు మాత్రమే. నగరంలో చాలా చోట్ల ఇదే పరిస్థితి. నగర పరిధిలో నిర్మాణాల అనుమతుల పేరిట ఇళ్లు, భవనాల నిర్మాణదారుల నుంచి రూ.లక్షలు గుంజుతున్నప్పటికీ తగిన మౌలిక సదుపాయాలు లేవు. ఎక్కడికక్కడ పార్కు స్థలాలు ఉన్నప్పటికీ వాటిని వినియోగంలోకి తీసుకురావడం లేదు. వాటిలో పిచ్చిమొక్కలు తొలగింపు, చుట్టు కంచెలకే రూ.లక్షలు ఖర్చుచేసినట్టు లెక్కల్లో చూపుతున్నారని కాస్త కార్పొరేషన్ కార్యకలాపాలను పరిశీలిస్తున్నవారు చెబుతున్నారు. కార్పొరేషన్‌లో అన్నీ తానై వ్యవహరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే వీటిపై దృష్టిపెట్టి, పనుల్లో పారదర్శకత పాటిస్తేనే పాలకవర్గానికైనా, ప్రభుత్వానికైనా మంచిదని, లేదంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం నేర్పక తప్పదని జనం చర్చించుకుంటున్నారు.

చంద్రబాబు అరెస్టుతో భగ్గుమన్న టిడిపి శ్రేణులు


బొబ్బిలి: కోటలో బైఠాయించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - వంగర

టిడిపి అధినేత చంద్రబాబును సిఐడి పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి మండల నాయకులు శనివారం నిరసన తెలిపారు. అరసాడలో నియోజకవర్గం మహిళా అధ్యక్షులు లచ్చుబుక్క ధనలక్ష్మి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బలిరెడ్డి శ్రీనివాసరావు, బెజ్జిపురం త్రినాధరావు, నియోజకవర్గం ఎస్‌సి సెల్ అధ్యక్షులు మజ్జి గణపతి, ఆప్పి తిరుపతిరావు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. కొత్తవలస జంక్షన్‌లో శనివారం రాస్తారోకో చేశారు. సిఐడి అక్రమంగా అరెస్ట్ చేసిన కారణంగా కొత్తవలస టిడిపి నాయకులు నల్ల బ్యాడ్జీలతో వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ముఖ్యమంత్రి డౌన్ డౌన్ అంటూ, నినాదాలు చేశారు. ఈ సమయంలో నాయకులకు, పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. శనివారం అర్ధరాత్రి నుండే టిడిపి నాయకులను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. టిడిపి విశాఖ పార్లమెంటరీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు బొబ్బిలి అప్పారావు, మాకేన సీతారాం పాత్రుడు, మన టిడిపి అధ్యక్షుడు గొరపల్లి రాము, కార్యదర్శి కనకాల శివ, బీశెట్టి ప్రసాద్, తిక్కాన చినదేముడు, టిడిపి బీసీ సెల్ వెలమ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ రెడ్డి పైడినాయుడు, కొరుపోలు అప్పారావు, లంక శ్రీను తదితర 18 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. **వేపాడ** మండల కేంద్రంలో వల్లంపూడి కూడలి వద్ద సుమారు 500మంది కాగడాలతో ర్యాలీ చేసి నిరసన వ్యక్తం చేశారు. మండలంలో టిడిపి నాయకులను ముందస్తుగా వల్లంపూడి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. టిడిపి మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు, ఉపాధ్యక్షుడు పాతల రమణ, ప్రధాన కార్యదర్శి కొట్యాడ వెంకటరమణ, మండల బిసి సెల్ అధ్యక్షుడు సేనాపతి గణేష్, మండల రైతు సంఘం ఉపాధ్యక్షుడు సిరికి రమణలను పోలీసులు నిర్బంధించారు. **డెంకాడ** మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు ఆధ్వర్యంలో శనివారం నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విజయనగరం నాతవలస రహదారిపై కొంత సేపు నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ కాగితాల సత్యనారాయణ, నాయకులు పాణిరాజు, జిన్న శ్రీను, అప్పలనాయుడు, సత్యనారాయణ, పలు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **పూసపాటిరేగ** మండల కేంద్రంలో జాతీయ రహదారిపై టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరరావు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రాజు వీధిలోని ఎన్‌టిఆర్ విగ్రహం వరకు ర్యాలీ చేస్తూ జగన్ రెడ్డి నిరంకుశ పాలనకు ఇది పరాకాష్ఠ అంటూ నినాదాలు చేశారు. నిరసనలో రాష్ట్ర కార్యదర్శి గంగా భూలోక్, నాయకులు దల్లి ముత్యాలరెడ్డి, పిన్నింటి సన్యాసి నాయుడు, పిన్నింటి శ్రీనివాసరావు పసుపులేటి గోపి, ఇజ్జురోతు ఈశ్వరరావు, విక్రమ్ జగన్నాధం, రౌతు సాగి నాయుడు, మురపాల బోగేస్, కునిశెట్టి గోవిందరావు, పిల్ల లక్ష్మీనారాయణ, కొక్కోకోట వెంకటరమణ, బొంతు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. **నెల్లిమర్ల** పట్టణంలోని రామతీర్థం జంక్షన్, జరజాపు పేట, రామతీర్థం గ్రామాల్లో టిడిపి నాయకులు శనివారం నిరసన ధర్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా జరజాపుపేటలో టిడిపి పార్లమెంట్ మహిళా అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి, నగర పంచాయతిలో పట్టణ టిడిపి అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, రామతీర్థంలో జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. జిల్లా సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్‌ని విజయనగరంలో ముందస్తుగా పోలీసులు గృహ నిర్బంధం చేశారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్ల మెంట్ కార్యదర్శి లెంక అప్పల నాయుడు, పోతల రాజప్పన్న, మండల తెలుగు యువత అధ్యక్షులు నల్లం శ్రీనివాసరావు, నాయకులు రెడ్డి వేణు, అట్టాడ శ్రీధర్, ఆల్తి నల్లిబాబుని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. నిరసనలో పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి అవనాపు సత్యనారాయణ, చిల్ల పద్మ, చీకటి సుహాసిని, కోట్ల సునీత, కింతాడ కళావతి, పొడుగు కృష్ణ వేణి, పాల్గొన్నారు. **రేగిడి** మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద మాజీ ఎంపిపి కిమిడి రామకృష్ణంనాయుడు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు నల్ల బ్యాడ్జీలతో శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో మాజీమంత్రి కిమిడి కళా వెంకట్రావు రేగిడి పోలీస్ స్టేషన్ చేరుకుని ఎస్ఐ శ్రీనివాసరావుతో మాట్లాడారు. వీరితోపాటు టిడిపి నాయకులు లావేటి సత్యంనాయుడు, రాంబాబు, మహేష్, పైల వెంకటరమణ, వంగర, రేగిడి టిడిపి నాయకులు ఉన్నారు. **బాడంగి** మండలంలో గజరాయునివలస ఎంపిటిసి, రాష్ట్ర ఎస్‌టి సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు ఎరుకులపాకలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన్ను బాడంగి పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. **జామి** మండలంలో జాగారంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌లో టిడిపి నాయకులు నిరసన చేపట్టారు. నిరసనలో మండల యువజన అధ్యక్షులు రాయవరపు శంకర్రావు, జామి మాజీ సర్పంచ్ ఇప్పాక వెంకట త్రివేణి, కొత్తలి సూర్యారావు, రామయ్యపాలెం మాజీ సర్పంచ్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. చంద్రబాబు అరెస్ట్ అనంతరం మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు, టిడిపి మండల అధ్యక్షులు లగుడు రవికుమార్, వి.రమణ తదితరులను ముందస్తు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారు. **బొండపల్లి** మండల సముదాయం వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూలమాల వేసి సిఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా తొలుత మండల టిడిపి అధ్యక్షుడు కోరాడ కృష్ణ, మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీలను అరెస్టు చేశారు. **శృంగవరపుకోట** పట్టణంలోని దేవి కూడలిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ నాయకులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులను ఎస్‌కోట సిఐ బాల సూర్యారావు, ఎస్సై తారకేశ్వరరావు, మరో ఎస్సై లోవరాజు తమ సిబ్బందితో అరెస్టు చేసి పట్టణంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు,పాల్గొన్నారు. **గజపతినగరం** నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు శనివారం ఆందోళన చేశారు. అనంతరం పోలీసులు కెఎ నాయుడుతో సహ పలువురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కి తరలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **మెరకముడిదాం** మాజీ ఎంపిపి, ప్రస్తుత టిడిపి మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడును పోలీస్ సిబ్బంది శనివారం గృహ నిర్బంధం చేశారు. స్కిల్ డెవలప్ మెంట్ కుంభ కోణంలో మాజీ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడును సిఐడి సిబ్బంది అరెస్ట్ చేసిన సందర్భంగా మండలంలో ప్రజలకు శాంతి భద్రతలకు విఘాతం కలగ కుండా ఉండెందుకు ముందస్తుగా గృహనిర్బంధం చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. **బొబ్బిలి** పట్టణంలో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆందోళన చేపట్టేందుకు టిడిపి నేతలు సిద్ధమవ్వగా బేబినాయనను, పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్‌ను కోటలో పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు హౌస్ అరెస్టు చేశారు. పోలీసులు నిర్బంధాన్ని తప్పించుకున్న బేబినాయన ఎన్‌టిఆర్ బొమ్మ వద్ద నిరసన తెలిపేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డగించడంతో కోటలో బైఠాయించి నిరసన తెలిపారు. పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, ప్రధాన కూడలిలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **చీపురుపల్లి** పట్టణంలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ కిమిడి నాగార్జున ఆధ్వర్యంలో, పార్టీ శ్రేణులు శనివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని ప్రధాన రహదారులు మీదుగా ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రౌతు కామునాయుడు, పైల బలరాం, చనమల మహేశ్వర రావు, సారేపాక సురేష్ బాబు,రెడ్డి గోవింద, ముల్లు రమణ, రౌతు నారాయణరావు, మహంతి రమణమూర్తి, కుమిలి శ్రీను, గవిడి నాగరాజు, శ్రీను, శనపతి శ్రీనివాస రావు, బలగం వెంకట రావు, వెంపడాపు రమణ మూర్తి, మహంతి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. **లక్కవరపుకోట..** అధికారంలో ఉన్నప్పుడు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్స్ ద్వారా 92 వేల మంది యువతకు ఉద్యోగాలు ఇచ్చినందుకా చంద్రబాబును అరెస్టు చేశారా? అని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రశ్నించారు. తమ నాయకుడి అరెస్టుపై స్పందించిన ఆమె స్వగృహంలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. టిడిపికి ప్రజలు బ్రహ్మరథం పెట్టడం, పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇటువంటి నీచమైన దుశ్చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. దీనికి ముందు ఆమెను పోలీసులు గృహ నిర్భందం చేశారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరాంప్రసాద్, మాజీ ఎంపిపి రమణమూర్తి, మాజీ జెడ్‌పిటిసి కరెడ్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **గంట్యాడ..** తెలుగు రాష్ట్రాలకు అనేక సేవలు అందించిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని అరెస్ట్ చేసిన విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వ్యాపారవేత్త కొండపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎఫ్ఐఆర్ కాపీలో పేరు లేకుండా, సరైన నోటీసులు లేకుండా, ఎటువంటి వివరణ కోరకుండా, ప్రొసీజర్ ఫాలో కాకుండా, ఒక హై ప్రొఫైల్ భద్రత కలిగిన వ్యక్తిని ఇలా అర్ధరాత్రి చుట్టుముట్టి మూకుమ్మడిగా అరెస్ట్ చేయడం కరెక్ట్ కాదన్నారు. దీన్ని కేవలం రాజకీయ అణిచివేత చర్యగా భావిస్తున్నామని వెల్లడించారు.

ఎస్‌కోట: గొంప కృష్ణను అరెస్టు చేస్తున్న పోలీసులు

గజపతినగరం: మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు


రేగిడి.. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐతో మాట్లాడుతున్న కళావెంకటరావు

ఎల్‌కోట: మాజీ ఎమ్మెల్యే కోళ్ల దంపతులను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

నెల్లిమర్ల: జరజాపుపేటలో నిరసన ర్యాలీ చేస్తున్న మహిళా నాయకులు

ఉచిత బీమా సౌకర్యం

ప్రజాశక్తి- మెరకముడిదాం

సచివాలయ కన్వీనర్లకు, గృహ సారధులకు వైసిపి ప్రభుత్వం ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు మండల కన్వీనర్ కుచ్చర్ల పాటి శివరామకృష్ణ ప్రసాద్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దీనిని సద్వినియోగం చేసుకోవాలని, వారి యొక్క ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, చిరునామా కూడిన వివరాలు తెలియ చేయాలని ఆయన తెలిపారు.

పింఛను అందిస్తున్న ఎంపిపి దొగ్గ సత్యవంతుడు

కొత్త పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కుంపల్లిలో కొత్తగా మంజూరైన 19 సామాజిక పింఛన్లను ఎంపిపి డి.సత్యవంతుడు చేతులు మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రార్ధనలు చేస్తున్న భక్తులు

ఘనంగా మేరీమాత పండగ

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని కోడూరులో శనివారం మేరీమాత పండగ ఘనంగా నిర్వహించారు. ఫాస్టర్స్ విజయకుమార్, మల్లవరపు ప్రకాష్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శనం చేసుకున్నారు. రైతులకు పంటలు బాగా పండి అధిక లాభాలు రావాలని పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఎస్ఐ జయంతి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్త్ నిర్వహించారు.

నేరాలు ఘోరాలు

కోతి దాడిలో 12 మందికి గాయాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గాయపడిన బాలుడు

నగర పంచాయతిలో జరిగిన కోతి దాడిలో 12మందికి గాయాలయ్యాయి. శనివారం స్థానిక గాంధీ నగర్ కాలనీ, సెగిడి వీధిలో కోతి దాడి చేసి చిన్న పిల్లలను కరిచింది. ఎక్కడ నుంచో ఒక కోతి వీధిలోకి వచ్చిందని దానికి ఆదరించి ఆహారం పెడితే తిని పిల్లలతో ఆడుకొని ఒక్కసారిగా దాడి చేసి గాయ పర్చినట్లు స్థానికులు చెబుతున్నారు. గాయపడిన వారు స్థానిక సిహెచ్‌సిలో చికిత్స తీసుకున్నారు.

బస్సు బైకు ఢీకొని వ్యక్తి గాయాలు

ప్రజాశక్తి- గంట్యాడ

మండల కేంద్రంలో బస్సు, బైకు ఎదురుగా ఢీకొనడంతో గంట్యాడ గ్రామానికి చెందిన రాళ్లపూడి ఎర్నాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు వెంటనే స్పందించి చికిత్స నిమిత్తం క్షతగాత్రున్ని 108 వాహనంపై జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

అవినీతికి శిక్ష తప్పదు: ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి- బొబ్బిలి

అవినీతికి పాల్పడిన వారెంతటి వారైనా శిక్ష తప్పదని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు అధికారాన్ని అడ్డంపెట్టుకుని బోగస్ కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అవినీతికి పాల్పడడంతోనే సిఐడి పోలీసులు అరెస్టు చేశారన్నారు. చంద్రబాబుపై రాజకీయ కక్షతో అరెస్ట్ చేసినట్లు టిడిపి చేసిన ఆరోపణలలో వాస్తవం లేదన్నారు. రాజకీయ కక్షతో అరెస్టు చేయాలంటే వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అరెస్టు చేసి ఉంటారన్నారు. అవినీతి చేసిన వారు ఎవరైనా శిక్ష నుంచి తప్పించుకోలేరన్నారు. ఆయనతో మున్సిపల్ చైర్మన్ వెంకట మురళీకృష్ణ, పట్టణ అధ్యక్షులు గోపాలరావు ఉన్నారు.

డెంకాడ: చంద్రబాబునాయుడు అరెస్టు సక్రమంగానే జరిగిందని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మోపాడలోని ఆయన స్వగృహంలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు దిట్ట అని అన్నారు. స్కిల్ డవలప్‌మెంట్ పేరిట ప్రజాధనాన్ని దోచేయడంతోనే సిఐడి పోలీసులు అరెస్టు చేశారని చెప్పారు.

గజపతినగరం: చట్టం తన పని తాను చేసుకుపోతుందని చట్టానికి ఎవరూ అతీథులు కారని తప్పు చేసిన వారు కచ్చితంగా శిక్షణ అనుభవించాల్సిందేనని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని చంద్రబాబు కోట్ల రూపాయల స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్టుకు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి తన ఖాతాకు మళ్లించుకున్న ఆధారాలతో సహా కేంద్ర ప్రభుత్వ నిఘా సంస్థలకు దొరికిపోయారని అందుకే అరెస్టు చేశారని అన్నారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, సర్పంచులు బెల్లాన త్రినాధరావు, మండల సురేష్, సామంతుల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగు మేలు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న అధికారులు

రైతులకు మేలు చేకూర్చే నవధాన్యాల సాగు మేలని రైతు సాధికారిక సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని మెట్టవలసలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బొబ్బిలి సబ్ డివిజన్‌లో జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను సంబంధిత వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఏయే పద్ధతుల్లో ఏయే పంటలు వేస్తున్నారని, అవలంబిస్తున్న పద్ధతుల గురించి అడిగారు. ప్రకృతి వ్యవసాయ విధానాలని తెలుసుకొని మరింత ఎక్కువ విస్తీర్ణంలో ఈ విధానాల్ని విస్తరించడానికి ఏ విధమైన చర్యలు చేపడుతున్నారని అక్కడ ఉన్న రైతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మన పంటలకు ముందుగా నవధాన్యాలు వేసుకోవడం వల్ల ఎంత ఉపయోగం ఉంటుందనే విషయాలపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వామినాథన్ ఫౌండేషన్ ఆయనకు డాక్టర్ స్వామినాథన్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించిన సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి, జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రభంధకులు, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్ ఎడిఎ, బొబ్బిలి ఎడిఏలు వి.టి రామారావు, ఆనందరావు, ప్రకాశరావు, శ్యాం సుందర్, సర్పంచ్ పి. మధవరావు, వైస్ ఎంపిపి అరసాడ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కేసు పత్రాలను పరిశీలిస్తున్న సివిల్ జడ్జి వాణి

రాజీయే రాజమార్గమని, కోర్టు కేసులో రాజీ చేసుకున్న కక్షిదారులు ఇద్దరూ విజయం సాధించినట్టేనని ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి అన్నారు. ఎస్.కోట కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1153 కేసులను న్యాయమూర్తి వాణి పరిష్కరించారు. ముందుగా న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కేసులతో పాటు మనోవర్తి వంటి కేసులు పరిష్కరించేందుకు కక్షిదారులు ముందుకు రావాలని కోరారు. లోక్ అదాలత్ ద్వారా ఇచ్చిన తీర్పులకు అప్పీలు చేసుకునే అధికారం లేదని వివరించారు. అందువల్ల కక్షిదారులు, అర్జీదారులు ఈ సదవకాశాన్ని ఎప్పటికప్పుడు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లు సత్యాజీ, ఎపిపి పప్పు కేశవరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు సూచనలు మేరకు నిర్వహిస్తున్న లోక్ అదాలత్ వల్ల కోర్టుల్లో పేరుకుపోయిన పెండింగ్ కేసులను సులువుగా పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి డబ్ల్యుఎస్‌శర్మ, న్యాయవాదులు ఎం.దుర్గాప్రసాద్, టివి సన్యాసిరావు, బి.త్రిమూర్తులు, మామిడి చంద్రశేఖర్, వారాది ఈశ్వరరావు, జి.చిట్టిబాబు, బివిఎస్ రామారావు, ఆర్.సత్యనారాయణ, టివిఆర్ మూర్తి, ఎం.అప్పారావు, బి.సత్యనారాయణ, బి.వెంకటరావు, సంతోష్, సిఐ బాల సూర్యారావు, ఎస్.ఐ తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం

ప్రజాశక్తి - కొత్తవలస

దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని శ్రీలలిత కన్వెన్షన్ హాల్లో గ్రామ వాలంటీర్లకు, గృహ సారుధులకు శనివారం ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్ కుమార్ ఆధర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహ సారధులు, వాలంటీర్లు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గడప గడపకు చేరవేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా గతంలో చంద్రబాబు నాయుడు చేసిన పాపాలకు, అవినీతికి నేడు సిఐడి నోటీసులు జారీ చేసి అరెస్టు చేస్తే, అందులో కూడా జగన్ మోహన్ రెడ్డి అస్తమే ఉందని ప్రచారం చేయడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, మాజీ ఎంపిపి గొరపల్లి శివ, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

వేపాడ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కుమ్మపల్లి సచివాలయం పరిధిలో కృష్ణ రాయుడు పేటలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపలోకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వేచలపు చినరామునాయుడు, ఎఎంసి చైర్మన్ మూకల కస్తూరి, ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, వైసిపి మండల అధ్యక్షులు మమ్ములూరి జగన్నాథం, మండల జెసిఎస్ ఇంచార్జ్ బోజంకి శ్రీను, వైస్ ఎంపిపి అడపా ఈశ్వర్ రావు, స్థానిక సర్పంచ్ సిహెచ్ ముసలి నాయుడు, ఎం.రామకృష్ణ, సచివాలయం కన్వీనర్లు నాగ స్వప్న, శ్రీను, సర్పంచుల సంఘం అధ్యక్షులు వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వికలాంగ విద్యార్థినుల మధ్య కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ బంగారమ్మ

అనాథలకు సేవ చేయడం అదృష్టం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నిరుపేదలకు, అనాథలకు సేవ చేయడం ఎంతో అదృష్టమని అందులో వికలాంగులకు సేవ చేయడం తన అదృష్టమని ఎపిఎస్ ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ అన్నారు. విజయనగరం ఉడా కాలనీలో గల శారదా వెల్ఫేర్ ఆశ్రమంలో తన కుమారుడు, నెల్లిమర్ల జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు పుట్టిన రోజు సందర్భంగా ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, బూరాడపేట ఆర్‌యమ్‌పి మక్కువ రమణ సహకారంతో విద్యార్థులకు శనివారం ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన కుమారుడు పుట్టినరోజు వేడుకలు విద్యార్థులతో చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. శారదా వెల్ఫేర్ ప్రదీప్ మాట్లాడుతూ తమ వెల్ఫేర్‌ని గుర్తుపట్టి ఇక్కడికి రావడం తమ విద్యార్థులతో గడపడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి, పెనుమజ్జి ఆదినారాయణ, భవాని, బూర్లె పైడినాయుడు, నెల్లిమర్ల వైసిపి నాయకులు పాల్గొన్నారు

స్థల పరిశీలన

గంట్యాడ : తాటిపూడి రిజర్వాయర్ ప్రాంతంలో గొరుపోటు బుచ్చి అప్పారావు విగ్రహ ప్రతిష్టకు ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య శనివారం స్థల పరిశీలన చేశారు. త్వరలో బుచ్చి అప్పారావు విగ్రహాన్ని స్థాపిస్తామని వెల్లడించారు. తాటిపూడి రిజర్వాయర్ 1960 నుంచి 1965 వరకు నిర్మాణ పనులు జరిగాయని ఆ ప్రాంతంలో తాటిపూడి గ్రామం ఉండడం వల్ల ఇంతవరకు తాటిపూడి రిజర్వాయర్ పేరుతో సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. జామి, గంట్యాడ, ఎస్.కోట మూడు మండలాలకు సాగునీరును అందిస్తూ విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు తాగునీరు అందిస్తుందన్నారు. పోలవరం ప్రాజెక్టు నుండి నీరును తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వరి నరసింహమూర్తి, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పీరు బండి జైహింద్ కుమార్, ఇరిగేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

12, 13న మండల స్థాయి స్కూల్ గేమ్స్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మాట్లాడుతున్న ఎంఇఒ పాపినాయుడు

ఈ నెల 12, 13వ తేదీలలో మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఇఒ బి.పాపి నాయుడు అన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ -14, అండర్ -17 కేటగిరిలలో జరిగే ఈ క్రీడా పోటీలు స్థానిక ఎస్‌విఎస్‌ఆర్ డిగ్రీ కాలేజ్ గ్రౌండ్‌లో జరుగుతాయన్నారు. అండర్14కు 1.1.2010, అండర్ 17కు 1.1.2007 తేదీల లోపు పుట్టిన వారు అర్హులన్నారు. ఖోఖో, కబడ్డీ అథ్లెటిక్స్, వాలీబాల్, త్రో బాల్, బాడ్మింటన్, బాల్ బాడ్మింటన్, యోగా వంటి క్రీడాంశాలలో పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించే బాలబాలికలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. మండల పరిదిలో చదువుతున్న బాలబాలికలందరూ ఈపోటీలలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆయన కోరారు. ఈ పోటలకు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌గా పి. లీలా కృష్ణ వ్యవహరిస్తారని చెప్పారు.

CHANGE OF NAME

I, NAGASETTI DHARMA RAO (Old Name), Residing at D.No. 2-129, Kesaripada, Kanchili Mandalam. Srikakulam-532291. Change my name from NAGASETTI DHARMA RAO (Old Name) to **NAGASETTI DHARMA RAJU** (New Name) hence forth I am being Called as NAGASETTI DHARMA RAJU (New name) S/o.Nagasetti Kantha Rao for all purpose.